క్లుప్తంగా

పశు గణనకు సహకరించాలి

మరికల్: పశుగణనకు రైతులు సహకరించాలని పశు వైద్యాధికారి వాసుదేవుడు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే పశుగణన సర్వేచేయడం కోసం రైతుల వద్దకు వస్తారన్నారు. ఇందుకు రైతులు తమ వద్ద ఉన్న పశువుల వివరాలు తెలుపాలని సూచించారు. ఇందుకు రైతులు సహకరిస్తే భవిష్యత్‌లో వాటికి వచ్చే సీజనల్ వ్యాధులకు తగ్గటుగా మందులు అందుబాటులో ఉంచుకుంటామన్నారు.

ఇసుక రీచ్‌లను తనిఖీ చేసిన తహసీల్దార్



మాగనూర్: మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుక రీచ్‌లను మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ పరిశీలించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో బుక్‌చేసిన వారికి రీచ్ యాజమానులు నాణ్యమైన ఇసుకను సరఫరా చేయాలని తెలిపారు. నాణ్యత లేకుండా ఇసుక సరఫరా చేసినట్లు మరోసారి ఫిర్యాదులు అందితే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



ఊట్కూరు: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే మండలంలో కొనసాగుతుంది. బుధవారం నిడుగుర్తి, చిన్నపొర్ల, పులిమామిడి, ఊట్కూరు తదితర ప్రాంతాలలో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు.

ఆలయంలో కార్తీక దీపోత్సవం



మద్దూరు: మండల కేంద్రంలోని పాండురంగ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి పూజలను పూజారి రాఘవేంద్రాచారి ఆధ్వర్యంలో నిర్వహించి, బ్రహ్మణ సమాజం ఆధ్వర్యంలో కార్తీక దీపాలను వెలిగించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

దామరగిద్ద: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని నీలకంఠేశ్వర మఠం వ్యవస్థాపకులు పూజ్య రత్నాకర స్వామి అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తిలో నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆలయ శిఖర ప్రతిష్ఠాన, ధ్వజారోహణ, నందీశ్వర, హనుమాన్ జగద్గురు నీలకంఠ పట్టాచార్య మహాస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నీలకంఠేశ్వర ఆలయ కమిటీ సభ్యులు జాంద్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు గాయాలు

కోస్గి: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో భాగంగా తనకు కేటాయించిన గ్రామంలో సర్వే చేసుకుని వస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి గుర్త తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన మున్సిపల్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుమిత్ర మున్సిపల్‌పరిధిలోని నాగుసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో భాగంగా అదేగ్రామంలో సర్వేచేసుకొని తన స్కూటీపై తిరుగు పయనమైంది. ఈ క్రమంలో నాగుసాన్‌పల్లిశివారులో రోడ్డు మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌తో సహ రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. అటుగా వెళ్తున్న కొందరు రైతులు గమనించి ఓ ప్రైవేట్ ఆటోలో కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృథాగా క్రీడా ప్రాంగణాలు

- పలుచోట్ల బోర్డులకే పరిమితం
- వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- నిరాశలో గ్రామీణ క్రీడాకారులు



ముళ్ల పొదలో చిక్కిన నేరడగం క్రీడాప్రాంగణం



వర్కూర్‌లో క్రీడా ప్రాంగణం ఇలా..

మాగనూర్: జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణతో కొన్నిరోజుల పాటు పండుగ వాతావరణం నెలకొంది. మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. అయితే అది కూడా మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలపై పట్టింపు కరువైంది. వసతుల లేమితో యువత మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మండల వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలోను పూర్తిస్థాయిలో వసతులతో మైదానాలు అందుబాటులోకి తీసుకురాలేదు.

రూ. 4లక్షలతో ఏర్పాటు..

ఉపాధిహామీ పథకం నుంచి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు రూ. 4లక్షల వరకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్‌బాల్, ఖో–ఖో వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలి. కొన్నిచోట్ల స్థలాల కొరత ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలు చెట్లపొదలు, గుట్టలు, బురదతో దర్శనమిస్తున్నాయి.

యువత క్రీడలకు దూరం..

గ్రామాల్లో ఆటస్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం క్రీడాకారుల పాటిటశాపంగా మారుతుంది. స్థలాల కొరత పేరుతో గ్రామాలకు దూరంగా, విద్యాలయాలలో క్రీడామైదానాలు ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడామైదానాలపై దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి..



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలు అధికారులు అడుగుతారనే ఆలోచనతో తూతూమంత్రంగా ఏర్పాటు చేసి రూ. లక్షల ప్రజాధనాన్ని వృథాచేశారు. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి.

– శివ, వర్కూర్ గ్రామస్తుడు

సదుపాయాలు కల్పించాలి..



ప్రస్తుతం నేను ఇండియన్ ఆర్మీకోసం కఠోర శ్రమతో కృషిచేస్తున్న ఇప్పటికే రాత పరీక్షలో కూడా ఉత్తీర్ణత సాధించాను. అయితే ఈవెంట్స్‌కోసం సాధన చేద్దామంటే క్రీడాప్రాంగణాల్లో సరైన సదుపాయం లేక సమీప పెద్దవాగులో సాధన చేస్తున్న.

– చిన్న నర్సింహ, ఎస్ఎఫ్ఐ నాయకుడు

ఉపయోగపడే విధంగా చూస్తాం

మండలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగకరంగా మారిన మాట వాస్తవమే. అయితే గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన స్థలాలతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పకుండా క్రీడా ప్రాంగణంలో కావాల్సిన వసతులు కల్పించి, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా చూస్తాం.

– రహ్మతుద్దీన్, ఎంపీడీఓ, మాగనూర్

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



మినీ స్టేడియం గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

నారాయణపేట రూరల్/ఎడ్యుకేషన్: క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా డీఈఓ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ ఎగరవేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోరా హోరీగా కొనసాగిన మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, చదువుతోపాటు ఆటలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, లయన్ రవికుమార్ గౌడ్, ప్రిన్సిపాల్, జాగృతి టీం సభ్యులు, పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

నారాయణపేట రూరల్: గ్రామ స్థాయిలో బీజేపీ పార్టీని పటిష్టం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ నాయకులు వెంకీ రాములు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సంస్థాగత కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ సభ్యత్వం మరింత పెంచాలని కోరారు. ఈ నెలలో జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసిందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి పలు గ్రామాల ప్రజలు ముందునుంచి భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. ఫార్మా బాధితుల తరుపున ఎప్పటికప్పుడు పట్నం నరేందర్‌రెడ్డి ప్రజల తరుపున మాట్లాడుతున్నారని ఇది ఓర్వలేక ఆయనపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. కాంగ్రె ప్రభుత్వం పాలన గాలికివదిలి అరెస్టులు, అక్రమ కేసులు, రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌గుప్తా, చిన్న హన్మంతు, ఎల్లారెడ్డి, ఈశ్వర్, కృష్ణారెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని స్థానిక శివాజీ చౌరస్తాలో మండల బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేసి మాట్లాడారు.. ప్రశ్నించే గొంతుకలను అక్రమ అరెస్టులతో అణచి వేయలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, శివశంకర్, రాజు రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

కోస్గి రూరల్: పట్టణంలోని స్థానిక శివాజీ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ పాల్గొని మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుతం పాలన గాలికివదిలి అరెస్టులు, అక్రమకేసులు, రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గు చేటన్నారు. జనార్దన్‌రెడ్డి, సాయిలు, పోషప్ప, మాదవరెడ్డి, నిరంజన్‌రెడ్డి, చెన్నకేశవులు ఉన్నారు.



మద్దూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మద్దూరు: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మద్దూరులోని అతిథి గృహం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాల్‌చందర్‌గౌడ్, రాములు, దాసు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల నాయకులు సుభాష్, కార్యదర్శి వన్నడ చంద్రకాంత్ అన్నారు. లగచర్ల ఘటనతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని అరెస్ట్ చేయడం ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నారాయణపేట టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత మధుమేహ చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు ఐఎంఎ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

మరికల్: వికారబాద్ జిల్లా లగచర్లలో రైతులను అరెస్ట్‌కు నిరసనగా చలో లగచర్లకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుటే నిరసన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే పోలీసులు ముందస్తుగా అరెస్ట్ పలువురు బీజేపీ నాయకులు అన్నారు. ఆయా కార్యక్రమంలో వేణు, శ్రీరాం, రమేష్, రాజేష్, వెంకటేష్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి రాజీలేని పోరాటం

కోస్గి: గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తామని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కోస్గిలో జరిగిన టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నికకు జిల్లా ప్రతినిధులు హాజరై మాట్లాడారు.. జర్నలిస్టులకు కావాల్సిన పలు అంశాలు పరిష్కరించేందుకు రాష్ట్ర కమిటీ కృషి చేస్తుందన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా దత్తు, సమీర్, ప్రధాన కార్యదర్శిగా బాలు, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా సాయిరాజ్, కార్యదర్శిగా రశీద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

మరికల్: బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని బండతాండకు చెందిన రాఘవేందర్, శ్రీను ఇద్దరు బుధవారం మరికల్ నుంచి బైక్‌పై బండతాండకు వెళ్తుండగా చౌరస్తాలో అదుపు తప్పిన బైక్ కిందపడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

మాగనూర్: మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఒకవైపు అధికారులు మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఒకవైపు ఆన్‌లైన్ అనుమతులతో ఇసుక గృహనిర్మాణదారులకు సరఫరా చేస్తుంటే మండలంలోని కొందరు ఇదే అదునుగా చేసుకునిని రాత్రి, పగలు తేడాలేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా నేరడగం పెద్దవాగుతోపాటు గజ్జరందొడ్డి, మందిపల్లి గ్రామాలనుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణాను సాగిస్తున్నారు. ట్రాక్టర్ల యాజమానులు కొందరు పోలీసు, రెవెన్యూ సిబ్బంది అండదండాలతో ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్‌తో వాహన పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

మరికల్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ మురళీ అన్నారు. మండలంలోని సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఆటో, జీపులు, ఇతర వాహనలను బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. డ్రైవర్ల వద్ద ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, కాగితాలను పరిశీలించారు. వాహనాలకు తప్పకుండా నంబర్‌ప్లేట్ కలిగి ఉండాలని, రాష్ డ్రైవింగ్ చేయొద్దని, అలాగే హెల్మెట్ ధరించి వాహనాలు నడిపించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, రమేష్, బీమ్లానాయక్, సురేష్ పాల్గొన్నారు.

కళలకు నిలయాలు బాలకేంద్రాలు



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాగరాజు

నారాయణపేట రూరల్ : సాంప్రదాయ కళలకు బాలకేంద్రాలు పట్టుకొమ్మలని మాజీ మార్కెట్ చైర్మన్ సరాఫ్ నాగరాజు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ పాఠశాలల విద్యార్థులకు బుధవారం బాల కేంద్రంలో కొనసాగుతున్న చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిత్ర కళలో ప్రావీణ్యం పొందడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 60మంది చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్ కుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

ధన్వాడ: క్రీడాకారులు గెలుపొటములను సమానంగా స్వీకరించాలని ఎంఈఓ గాయత్రి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14బాలబాలికల వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వాలీబాల్ పోటీలలో అత్యంత ప్రతిభ చూయించి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, హెచ్ఎం నర్సింహాచారి, నర్సింహులు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి..



మాగనూర్: మండలంలోని నేరడగందొడ్డి రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేక కనీసం ఆటోలు కూడా దొరకని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి

అమరచింత: సమగ్ర కుటుంబ సర్వే కొసం వస్తున్న ఎన్యూమరేటర్‌లకు అడిగిన సమాచారం ఇచ్చి సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. మండలంలోని కొంకన్వానిపల్లే, పాంరెడ్డిపల్లే గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌లలో ఎన్యూమరేటర్‌లు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్న తీరును వారు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెపడుతున్న సర్వే వల్ల కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సహకారం అందించాలో అన్న విషయాలతో పాటు వారి ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. డీటీ రెడ్యానాయక్, ఆర్ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులుతో పాటు పలువురు అధికారులు సర్వే పనితీరును పరిశీలించి తప్పులు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచనలు అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ బాలరాజు

ఆత్మకూర్: రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సంతోష, కోచ్ ఖాదర్ తెలిపారు. బుధవారం రాత్రి నారాయణపేట జిల్లా ధన్వాడలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఎంపికల్లో ఆత్మకూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, బిందుమాధవి, అమృత, సహస్ర అత్యంత ప్రతిభను కనబర్చారన్నారు. ఈ నెల 16న మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు, విద్యార్థులను అభినందించారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



అమరచింత: పట్టణం నుంచి మద్దూర్‌కు వెళ్తున్న బీటీ రహదారి పక్కన కేబుల్ లైన్‌కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా తయారైంది. రోడ్డుపై ప్రయాణం చేస్తున్న వాహనదారులతోపాటు ఇతర వాహనదారులు ఆదమరిస్తే చాలు గుంతలో పడి ప్రమాదం తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. జియో ఇంటర్‌నెట్ లైన్ కోసం రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న కేబుల్ లైన్‌కు మధ్యమధ్యలో గుంతలను తవ్వి వాటిని పూడ్చకపోవడంతో ఎప్పుడు ప్రమాదం ఏర్పడుతుందోనని భయాందోళనలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి వాటిని పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతుల ఇబ్బందులు తొలగించాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేతేపల్లి రైతువేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 25 రోజులు అవుతున్నా కాంటా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అద్దె తీసుకొచ్చారని, దీంతో అద్దె భారం పడుతుందన్నారు. వర్షం వస్తే కప్పేందుకు టార్పాలిన్ కవర్లు ఇస్తామని అధికారులు చెబుతున్నా ఈ దిశగా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయలేదని వాపోయారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం త్వరగా కాంటా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని లేనిచో రైతులతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో దంగు కుర్మయ్య, అంజి, కాకం చిన్ననారాయణ, కుర్వ హన్మంతు, చిన్నకుర్మయ్య, రాముడు, నర్సింహ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.